
పాలగిరి వేణు

# అభిషేకం




కథల పోటీలో
మొదటి బహుమతి
రూ.2,500/-
పొందిన కథ.

ఆవూరి అంటరానోళ్ళ సుట్టిండ్లను దాటితే నర్సరాజోళ్ళ బంజరుభూములు... అవతలగా కానగల తోపు... ముప్ఫయి బారల దూరంలో 'బురాయిగుంట'.

ఆ గుంటలో నీళ్ళు మోకాళ్ళదాకా వస్తాయి... గుంటమధ్యలో కొన్ని కలువలు ఎండకువాడి, ఆ బురదనీటిలోనే వాలిపడివున్నాయి...

నీళ్ళు బురదతో ఎర్రటిరంగుదేరి అసహ్యంగా వుంటాయి... అయినా... ఆ నీళ్ళలోనే అంటరానిపల్లె జనం స్నానాలు చేస్తారు... బట్టలు వుతుకుతారు. ఒక్కోసారి 'అంటరాని'పల్లె బావిలో నీళ్ళు ఎండిపోతే ఈ నీళ్ళు తాగడానికి కూడా వుపయోగిస్తారు కొంతశుద్ధి చేసుకుని...



ధారణంగా ఈ గుంటను 'అంటరాని' జనం తప్ప వేరేవాళ్ళు పుపయోగించరు... 'గుంట'లో పశువుల్ని కడగటం నిషిద్ధం కూడాను... ఏ యితర్రతా వుపయోగించరు...

సాయంకాలం వాలుగయింది... ఎండబాగా కాస్తూ వేడిసెగల్ని విరజిమ్ముతోంది...

ఆ గేదెలు ఏ బురదగుంటలో విశ్రమించాయోగాని వాటి శరీరాలన్నీబురదతో... పేడతో నిండి వున్నాయి... రామనాయుడుగారి గంగాధరం ఆ గేదెల్ని తోలుకుంటూ నుతాయికుంటవైపు నడిచాడు... కుంటలోనికి గేదెల్ని తోలి, గట్టుమీదున్న పచ్చటి గరికతో గేదెల శరీరాల్ని శుభ్రం చేస్తున్నాడు... వాడి నోట్లోంచి చుట్ట గుప్పున పొగ వదులుతోంది...

"అదేంటి సామీ! కుంట్లో గేదెలు కడుగుతున్నావ్" అంటూ ఎక్కణ్ణించో వచ్చిన ఎంకడు 'కుంటగట్టు' కాడ నిలబడ్డాడు... నడుము వంగిన ఆ బక్కశరీరంపై ఏలాటి అచ్ఛాదన లేదు..., ఓ పుట్టగోచీ తప్ప... నెత్తిమీద గడ్డిమోపుంది...

"ఏం? కడిగితే తప్పట్రా ముసలి/వాకొడుకా!" అంటూ చుట్టను నోట్లోంచి తీసి నీళ్ళలోనికి గిరాటేశాడు గంగాధరం.

"అది కాద్సామీ! మా జనం ఈ కుంట్లో నీళ్ళుతుక్కుంటారు... స్నానాలు కూడా చేస్తారు... గేదె కొచ్చుతో నీళ్ళా 'గలీజు' అవుతాయి సామీ! అందుకని వ ద్దంటున్నా సామీ!..." ఎంతో వినయంగా చెప్పాడు ఎంకడు...

"ఏంట్రో ఎంకా? పెద్దపెద్ద మాటలు మాట్లాడేస్తున్నావ్" అంటూ నీళ్ళ వల్లదనానికి కూలబడ్డ గేదెల తోకల్ని మెలిపెడ్తున్నాడు గంగాధరం...

ఇంతలో ఎంకడి కొడుకు కొండడు, వాడితోటి జనం కూలికెళ్ళి వస్తూ కుంటవైపు నడిచారు...

"ఏంటయ్యోయ్? యీ కుంట్లో గేదెల్ని కడుగుతావ టయ్యా! పద... పద..." మంటూ ముందుకొచ్చాడు కొండడు...

"ఏంట్రోయ్! ఏం మీ బాబుదనుకున్నావా ఈ కుంట... పద పద మంటున్నావ్? కొడుకులంకి ఒళ్ళు బలిసినట్లుంది..." అన్నాడు గంగాధరం పొగరుగా...

"మా బాబుదయితే ఈపాటికి మిమ్మల్ని, మీ గేదెల్ని ఏం చేసేవాడినో తెలిసొచ్చేది... అనవసరంగా గొడవెట్టుకో మాకండి. బలిసిన నాకొడుకులం ఏమైనా జేస్తాం..." అన్నాడు కొండడు... కొండను పిండి చేసే శక్తివుంది కొండడికి.

"ఏం చేస్తావురా దొంగ నాకొడకా" అంటూ గంగాధరం నీళ్ళలోనుండి గట్టుపై కొచ్చి, గేదెల్ని తోలే ఈతబెత్తాన్ని ఝళిపిస్తూ కొండడి మీదకు వచ్చాడు...

"పోనీలేండి సామీ! ఏదో బుద్ధిలేని చిన్నోడవ..." అంటూ గంగాధరం ఎదురుగ్గా తలమీది గడ్డి మోపు తోనే వచ్చి నిలబడ్డాడు ఎంకడు.


"నీవడ్డం తీరా లంజ నాకొడకా" అంటూ ఎంకడ్ని ప్రక్కకు తోసి, గంగాధరం, యీత బెత్తాన్ని కొండడిపై ఎత్తాడు...

"అంటరాని" జనం పోగయ్యారు... గంగాధరాన్ని ఆడిపోసు కుంటున్నారు. కొండడు వలుపుగా గంగాధరం ముంజేయిని పట్టుకుని ఈతబెత్తాన్ని లాక్కున్నాడు...

గంగాధరానికి తెలుసు. తను ఒక్కడు..., వాళ్ళు పది మంది... అందులో కొండడి చేత దెబ్బలు తింటే వూళ్ళో తన పరువేగాదు... రామానాయుడు పరువు కూడ నట్టేట్లో మునుగుతుంది... అనువుగాని చోట అధికుల మనరాదనుకుని కాలికి బుద్ధి చెప్పాడు గంగాధరం... ఊళ్ళో ఈ సంగతి ఎవ్వరికి చెప్పలేదు కూడాను...

ఇది జరిగి సరిగ్గా నెలరోజులయింది...

అదేంటోగాని ఈ ఏడు వానచుక్క పడలేదు... అనావృష్టి మూలంగా బావులు ఎండాయి... గుంటలు ఎండాయి. చెరువులు ఎండాయి... తాగటానికి నీళ్ళచుక్క లేక జనం యిబ్బంది పడిపోతున్నారు.... ఊరి ముందరి బావిలో పూడు తీయించారేగాని లాభం లేకపోయింది...






## సన్మానం

మంత్రి మాధవయ్యకి సన్మానం చేస్తున్నారు.

"ఇంతకీ ఈ సన్మానం అతనికి ఎందుకు చేస్తున్నారు" అడిగాడు ఓ వ్యక్తి నిర్వాహకులను.

"అతనికి నూరు సన్మానాలు పూర్తయ్యాయి. అదీ విషయం" చెప్పారు నిర్వాహకులు.

—చి.ప్రకాష్ (చిత్తూరు)

పశువులకు మేతలేక 'ఈసురో' మంటున్నాయి... గొర్రెలు, మేకలు ఎర్రగుంట్ల మస్తాన్‌సాయిబు కబేళాకు అమ్ముడుపోతున్నాయి... నీళ్ళు లేక పొలాలు ఎండాయి. పంటలు మసి అయ్యాయి... తింటానికి తిండిలేక, తాగటానికి నీళ్ళా లేక ఎక్కడైనా బతికేందుకు వ లసపొయ్యారు కూలిజనం... ముసలి, ముతక మంచానబడి ఆకలితో అలమటిస్తున్నారు... ఇంత పెద్ద కరువు ఎప్పుడూ చూడలేదన్నారు... ఏ రాగిగంజో తాగుతూ, వూరి ముందర బావిలోని పూడు నీళ్ళనే తాగుతున్నారు. ప్రభుత్వ సహాయ కార్యక్రమం క్రింద యిచ్చిన తిండి గింజలు పేదవాడి కడుపుల కందలేదు... మధ్యలో దళారి చేతుల్లోబడి మాయమయ్యాయి... కరువు 'కరాళనృత్యం' చేస్తోంది... ఆకలి అయ పలుకుతోంది...

మధ్యాహ్నం మూడు గంటలు... రచ్చబండ కిందకు చేరారు ఆ వూళ్ళో పెద్ద మనుష్యులనబడే రామానాయుడు, రంగయ్యశెట్టి, పూజారి రామయ్య పంతులు, కరణంగారనబడే మాజీ కరణం మల్లేశం ఆ రచ్చబండపై చల్లటినీడను పరుస్తున్నాయి వేపచెట్టు రావిచెట్టు. వేడిగాలి విసురులకు మధ్యాహ్నం నిద్రపట్టక అక్కడ నీడన చేరడం, ఏదో బాతాఖానీ కొట్టడం ఆ వూరి ప్రజలకు అలవాటు అయిపోయింది... ఎలాగూ పనిపాటల్లేవు... రచ్చబండపై పెద్ద మనుష్యులు బైఠాయిస్తే, కింద సుబ్బడు, రమణిగాడు తదితర బీదజనం బాసింపట్లేసుకుని, బీడీలు కాలుస్తూ కూచుంటారు... పెద్దల మాటలకు 'వూ' కొడ్తూ తందాన పాడుతుంటారు...

"ఏంటోనండి ఈసారి వానచుక్క పడకపోయే...

రాములోరి గుడిలో విరాటపర్వం చెప్పించామా! కట్టమీద బీదలకు అన్నదానం చేశామా! కప్పల పెళ్ళిళ్ళు జరిపించామా, పిల్లలను ఒంటిమీద బట్టలేక్కుండా పొలాల్లో రాత్రిపూట తిప్పామా!... ఏం లాభం... మానవ ప్రయత్నం చేశాం... అయినా భగవంతుడికి మనపై కరుణ కలగలేదు..." అన్నారు కరణం మల్లేశంగారు.

"నిజమేనయ్యా కరణం... మన చేతుల్లో ఏమీలేదు" అన్నాడు ఓ పెద్ద నిట్టూర్పు వదులుతూ రామానాయుడు... ఈసారి గంజి కేంద్రాన్ని తనే నడపాలను కుంటున్నాడు... ప్రభుత్వం యిచ్చే గ్రాంట్లను, ధాన్యాన్ని తన పీకల దాకా మెక్కేయాలని

చూస్తున్నారు.

"అలా అని చేతులు ముడుచుకు కూచుంటే ఎలాగండి కడుపు నిండిన మా రాజులు... ఏ జన్మలోనో మనం చేసుకున్న పాపం ఈనాడు ఇలా శపిస్తోంది... అందుకని" అంటూ ఆ పాడు పూజారి రామయ్య పంతులు... గుళ్ళో దేవుడికి నైవేద్యం పెట్టలేక లేమితనంతో తన కుటుంబాన్ని పోషించలేక, వీధిన పడ్డ బీద బ్రాహ్మడు.

"అందుకని... యింకా ఏం చేయమంటావ్ పూజారిగారూ!" అన్నారు రంగయ్యశెట్టి... ఏ సంతర్పణ లాంటి కార్యక్రమం జరిగినా వస్తురూపేణ చందాలివ్వటం వీరికి తప్పదు.., అయినా వూళ్ళో బీద, బిక్కి జనాల చెంబులు మొదలుకొని ఆడోళ్ళ మంగళసూత్రాల వరకు శెట్టిగారి దగ్గర కొలువుకు కుదురుతాయి... ఈ కరువు వల్ల బాగా లాభపడేది శెట్టిగారొక్కరే మరి... ఏమయినా కొంత పాపపుణ్యాలు బేరీజు వేసుకుని అడుగులేస్తుంటాడు...

"మన వూరి పొలిమేర దగ్గరున్న "బొడ్డురాయి"కి మాటొక్క బిందెల నీళ్ళతో అభిషేకం చేయిద్దాం... అభిషేకం చేయిస్తే వర్షాలు కురుస్తాయని..." పూజారిగారు ఆపారు.

రామానాయుడు గట్టిగా నవ్వాడు... రాత్రిపూట నక్కల గుంపు 'వూళ' వేసినట్లుంటుంది ఆ నవ్వు...

నాయుడుగారు ఎందుకు నవ్వారో అని ఆశ్చర్యంగా చూస్తున్నారు జనమంతా...

"మన బావుల్లో తాగేందుకు నీటి చుక్క లేదుగాని మాటొక్క బిందెల నీళ్ళా ఎక్కణ్ణించి తెస్తావయ్యా పంతులూ..." అంటూ మరింత బిగ్గరగా నవ్వాడు రామానాయుడు... ఆ నవ్వుకు భయపడి వేపచెట్లో కూచున్న కాకి బెదిరి లేచిపోయింది... వేపచెట్టు నుండి ఎండిన వేపాకు, గాలికి రాలుతోంది బంగారు ముక్కల్లే మెరుస్తూ!...

"నిజమేనండోయ్" అన్నారు కరణం మల్లేశం... చెంబును ఎరచూపి గంగాళాన్ని మాయంచేసే అతి పెద్ద లౌకికుడు... నోటి దురద తక్కువేగాని అరచేయి దురద ఎక్కువ.

పూజారిగారికి ఏమనాలో తెలియక మౌనంగా వుండిపోయాడు... కింద కూచున్న జనం రామానాయుడు గారు చెప్పింది నిజమేనని కరణం మల్లేశంగారికి వత్తాసు పలికారు...

"అవును పూజారిగారూ!... ఓ పనిచేస్తే...! మాటొక్క బిందెలు లేకపోతే మానే మాటొక్క చెంబులు పోయకూడదటయ్యా!..." అన్నాడు రంగయ్యశెట్టి.

"ఆ మాటొక్క చెంబులు నీళ్ళు కూడా ఎక్కడ దొరుకుతాయి . శెట్టిగారూ! ఊరి ముందర బావిలో నీళ్ళు వూరడానికి పూడు అడ్డమొచ్చె..." అన్నాడు రామానాయుడు చుట్ట వెలిగిస్తూ...

"పూడు తీయిద్దాం సామీ" అంటూ సుబ్బడు లేచి నిలబడ్డాడు.

"పూడు దీసే వడ్డెరోళ్ళు మనూరుదాటి వారం రోజులాయె... అవన్నీ యిప్పుడు జరిగేటివి కాదుకాని ఏదో మార్గం ఆలోచించండి కరణంగారూ!" అన్నాడు రామానాయుడు ఆరిపోయిన చుట్టను మరోసారి వెలిగించుకుంటూ. పొగ కుడివైపుగా జోరుగా వస్తూంటే ఇటు ప్రక్కకు వచ్చి కూచున్నాడు పూజారిగారు.

"నేనో మార్గం చెప్పనా కరణంగారూ!" అంటూ చిన్న బండపై కూర్చున్న గంగాధరం తలపైకెత్తి కరణం వైపు చూశాడు... చెప్పమన్నట్లు సైగచేశాడు కరణంగారు...

"అంటరానిపల్లె బావిలో నీళ్ళున్నాయి కదండి" అన్నాడు గంగాధరం...

"అపచారం గంగాధరం...!" 'అంటరాని' పల్లెలో నీళ్ళు దైవకార్యానికి వుపయోగిస్తారటయ్యా!! తప్పు...తప్పు" అంటూ నాలిక తెరిచి ముక్కున వేలు వేసుకున్నాడు పూజారి గారు...

తప్పేమిటండీ పూజారి గారూ! దైవ కార్యానికి నీళ్ళల్లో కూడా తేడాలుంటాయటండీ! మనం చేసేది పుణ్యకార్యం... ఏవీ అడ్డంకులు పెట్టకండి" అన్నాడు గంగాధరం...

"మాదు పూజారిగారూ! కనీసం ఈ అభిషేకంతోనైనా వానదేవుడు కరుణిస్తే మన కష్టాలన్నీ తీరుతాయి... దేవుడి దృష్టిలో నీళ్ళన్నీ ఒక్కటే... ఇక మీ యిష్టం" అన్నారు రామానాయుడు...

"మనుషుల్లోనే కులమత బేధాలు... జలాల్లో కూడా వుంటాయా పూజారి గారూ!" అన్నారు కరణం...

"అభిషేకం" జరిగితే తనకు దక్షిణ కింద వచ్చే ధన, ధాన్యాదులతో తన కుటుంబానికి ఓ ఆరుపూటలు గడుస్తాయి... ఆకలితో అలమటిస్తూ, తను తెచ్చే అరటిపళ్ళపై ఎంతో ఆశగా చూస్తున్న పిల్లలు గుర్తుకువచ్చారు పూజారిగారికి... మనసు అదోలా అయిపోయింది.

"దానికేముందిలేండి... పెద్దలు ఎలాచెప్తే అలాగేను..." అంటూ ఓ చిర్నవ్వునవ్వాడు పూజారిగారు...

"అయితే ఎంకడ్ని 'అంటరాని'పల్లె నుండి పిలిపించండయ్యా"అంటూ గంగాధరం వినయంగా మనవి చేశాడు పెద్దలకు...

"ఒరే! సుబ్బిగా! బేగెళ్ళి ఎంకడ్ని పిలుచుకురా పోరా!" అంటూ ఆజ్ఞ జారీచేశాడు రామానాయుడు...

"ఎందుకని అడిగితే ఏం సెప్పమంటారు సామీ!"

"ముందు వెళ్ళిరారా? అడిగితే తెలవదను..." అన్నాడు గంగాధరం. సుబ్బడు 'అంటరాని' పల్లె వైపు పరుగులు దీశాడు...

అప్పుడు సాయంకాలం నాలుగున్నరయింది... సాసవుల చిన్నమ్మ కొండకాడ సూరీడు, గుర్రాలకు దాణా పెడ్తున్నారు. బూడిద చింతమాన్ల కాడనుండి వడగాలి దూసుకు వస్తోంది... మరో పావుగంటలో... సుబ్బడు... వెనకాల ఎంకడు పరుగులుదీస్తూ వచ్చారు... సుబ్బడు చప్పున కూలబడ్డాడు... ఎంకడు రొమ్ము... డొక్కలు ఎగిరిపడుతున్నాయి... అలాగే నిట్టాయి కామకొని నిలబడిపోయాడు...

రచ్చబండ మీద పెద్దలకంతా దండం పెట్టాడు.

"ఏరా! ఎంకా!! బావున్నావురా?" అంటూ రామానాయుడు కుశల ప్రశ్నలు వేశాడు... తలూపాడు మౌనంగా ఎంకడు... 'అంటరాని' పల్లెకు పెద్ద దిక్కు...

"కూచోరా! కూచో!!" అన్నాడు కరణం...

ఎంకడు నేలమీద ముంగాళ్ళమీద కూచున్నాడు...

"ఏమి సామి పిలిచినారంట..."

"ఏముందిరా? వానచుక్క లేకపోయే... ఈ వూళ్ళో జనానికి తాగటానికి నీళ్ళు లేవుకదా? ఏం చేయాలో అన్నీ చేశాం. నీకు తెలుసుకదా? చిట్టచివరకు 'బొడ్డురాయి'కి అభిషేకం చేయిస్తే వానచుక్క పడుతుందని పూజారి గారు సెప్పార్రా!" అంటూ రంగయ్యశెట్టి, రామనాయుడుగారి దగ్గర పొగాకు అందుకుని చుట్టచుట్టూ...

ఇదంతా పిల్చి తనకెందుకు చెప్తున్నారో అర్థం కాలేదు ఎంకడికి...



చిల్లర


"ధర్మంబాబూ"

అడుక్కుంటున్నాడు బిచ్చగాడు.

బిచ్చగాడికి అర్ధరూపాయి యిచ్చి పావలా తిరిగి యిచ్చేయమన్నాడు కర్ణారావు చిల్లరలేక.

"నా దగ్గర కూడా చిల్లరలేదు సార్" అని కర్ణారావు చేతిలో రెండు చాక్ లెట్లు వుంచాడు.

—వి.ప్రకాష్ (చిత్తూరు)



"నిజమే సామీ! పెద్ద కరువులో వాన రాకపోతే బొడ్డురాయికి నీళ్ళుపోస్తే వానొచ్చింది సామీ" అన్నాడు ఎంతో అమాయకంగా ఎంకడు...

"అందుకని..." కరణంగారు మొదలెట్టేలోగా ఎంకడు కొడుకు కొండడు, వాడి వెంట రావుడు వచ్చి రచ్చమీదున్న పెద్దలకు వినయంగా నమస్కారాలెట్టారు...

"మా అయ్యను పిలిపిస్తే ఏంజరిగిందోనని పరుగెత్తుకొచ్చామండి" అంటూ ఎంకడి ప్రక్కలో కూర్చున్నాడు కొండడు... వాడి ప్రక్కన రావుడు కూలబడ్డాడు...

కొండడ్ని మాస్తూనే గంగాధరం ముఖం పెనంమీదపడ్డ జొన్నగింజలా చిటపటమంది...

"కానిసని అంటూ ఎంకడ్ని పిలిపించలేదురా కొండా!..." అంటూ 'బొడ్డురాయి' అభిషేకాన్ని గురించి విశదీకరించాడు రామానాయుడు.

"నీళ్ళేడున్నాయి సామీ...!" అన్నాడు కొండడు...

"అందుకనే గదరా ఎంకడ్ని పిలిపించింది" అన్నాడు కరణం...

"మా అయ్యేం చేస్తాడు సామీ! ఊరి ముందర బాయిలో వూడు తీయమంటారా సామీ!! బావి చుట్టు ప్రక్కలకే మమ్మల్ని రానియ్యరే! ఇంకెందుకబ్బా పిలిపించింది..." అన్నాడు కొండడు.

"ఊళ్ళో బావుల్లో నీళ్ళా ఎండుకున్నాయి కదరా? అందుకని మీ పల్లె బావిలో నీళ్ళున్నాయి. ఆ నీళ్ళతో బొడ్డురాయికి అభిషేకం చేద్దాం... అభిషేకంచేస్తే వానలు కురుస్తాయి... మన కష్టాలు తీరుతాయి... ఏ మంటావ్‌రా కొండా?" అన్నారు పూజారిగారు ఎంతో అనునయంగా...

"భలేవారు సామీ? ఆకలిపోతే గోచిలో రాయిపడినట్టు లేనిదాన్ని నమ్ముకుని వున్నదాన్ని వూడకొట్టినట్టు, వాన వస్తుందో రాదో తెలియదు... మా పల్లె జనాలకు గొంతు తడుపుతున్న నీళ్ళను పట్టివే దారపోయమంటారా సామీ!"

"మేం నీళ్ళులేక కష్టపడుతూంటే మీకు ఎగసెక్కంగా వుందిరా కొండా? ఏదో పంతులుగారు అభిషేకం అంటూ ముడేసేరు... భగవంతుడిపై నమ్మకం... అంతే..." అంటూ కరణంగారు మెల్లగా రంగయ్య శెట్టి దగ్గర్నుండి చుట్టిన చుట్టను సంగ్రహించాడు...

"అదో గుడ్డి నమ్మకం సామీ! నాకు మాత్రం 'బొడ్డురాయి'పై నీళ్ళు పోసినంత మాత్రాన వాన కురుస్తుందంటే విచిత్రంగా వుంది సామీ!" అన్నాడు నిర్భయంగా కొండడు...

"నీవన్నా చెప్పరా ఎంకా" అన్నాడు రంగయ్యశెట్టి... సరిగ్గా నెత్తిమీది వేపకొమ్మమీద కాకి కూచుని వుంది... అది రెట్టేస్తే మాసి ఆనందించాలని వుంది సుబ్బాడికి.

"ఉండ్రా కొండా? పెద్దోళ్ళు ఏవో మంచి మాటలు చెప్తూంటే బుద్ధిగా వినుకోంవేరా కొడకా! నీళ్ళ పాదాలకాడ పంజేసే వాళ్ళం... వాళ్ళు బాగుంటే కదరా మనం సుఖపడేది..." అంటూ ఎంకడు కొడుకు కొండయ్యను సముదాయించబోయాడు.

"ఏం సుఖ పడుతున్నామయ్యా! మూడేళ్ళ క్రితం మన బావిలో నీళ్ళు లేకపోతే మనమంతా కటకట లాడితే ఈ పెద్దోళ్ళా వచ్చి సాయంచేశారా? మన మెవ్వరూ చుట్టుప్రక్కల బావుల్లో నీళ్ళు ముట్టకూడదని, ముట్టితే నీళ్ళా మైలపడతాయని కట్టడి చేయలా? ఆ రోజు మొతకపల్లె వాళ్ళ బావిలో దిగి రంగి నీళ్ళుముట్టిందని, దానిపై ఈ రామానాయుడు సామి కొడుకు చేయిచేసుకోలా!... మన ఆడోళ్ళా వాల్లుమైళ్ళెళ్ళి సుంకరోళ్ళబావిలో వూడునీళ్ళు తెచ్చుకొని తాగలా! అవన్నీ మరిచిపోయి ఈనాడు ఈ పెద్దలు చెప్పింది వినాలా?... నీళ్ళ ఎత్తేమిటో తెలుసా అయ్యా! మనకూ డా వాళ్ళలాగే మన బావుల్లో నీళ్ళు లేకుండా చేయాలనీ... అంత తప్ప యింకేమి లేదయ్యా!..." ఎంతో ఉద్వేగంతో చెప్పకు పోతున్నాడు కొండడు...

కొండడి మాటలు పెద్దోళ్ళ గుండెల్లో ఈటెల్లా దిగుతున్నాయి... రామానాయుడు ముఖంలో రక్తం మరింత ఎరుపెక్కింది... కొండడు చెప్పడం ఆపి అక్కణ్ణించి కదిలాడు... వాడి వెనక ఎంకడు, రావుడు పరువులు తీశారు...

"నీదు తొమ్మిదోక్లాసు చదివే యింత మాట్లాడుతూంటే పై చదువులు చదివితే మనల్ని దున్నేశేవాడు కాదటయ్యా నాయుడూ..." అంటూ కరణం ఓసారి రామానాయుడు నాలకం చూపి నోరుమూసు క్కూచున్నాడు...

"ఒరే కొండా! అనవసరంగా వుద్రేక పడుతున్నావురా కొడకా? గంగతల్లి మన కన్యాయం చేయదురా! మన బావికింద ఊరే 'చెలమ' వుందిరా... బిందె చేదితే యింకో బిందెడు నీరు వూరతాయిరా!... వాళ్ళ బుద్ధులెలావున్నా అందరి బాగుకోసమే కదరా "బొడ్డురాయి"కి నీళ్ళా పోయటం... ఇంకో మాట చెప్పనా కొండా! కలిమివాడికి లేమివాడెప్పుడూ లోకువే!... పెద్దోళ్ళకెప్పుడూ 'అవసరం' అంటూ కలగదురా... అవసరం అంటూ కలిగేది మనకే!... నీ మాటలవల్ల ఈ పుణ్యకార్యం ఆగిపోతే మనల్నే ఆడిపోసుకుంటారు, ఈవూరి జనం..." అంటూ ఆపాడు ఎంకడు...

"పోనీరా కొండా! అయ్య చెప్పేది కూడా యిందాం... యీళ్ళ మాట కాదంటే ఓ జొన్నగింజ కూడ దొరకదు" అంటూ రావుకు చెప్పాడు.

కొండడు మౌనంగా ఆగిపోయాడు... వాడి మనసులో తర్జన భర్జనలు... ఉన్నవాడెప్పుడూ లేని వాడిని దోపిడి చేస్తూనే వున్నాడు... నిజంగా బావిలో మాటొక్క బిందెలు నీళ్ళున్నాయా? బావిలో నీళ్ళు వూరకపోతే తన పల్లె జనం ఎంత బాధపడాలి... 'కొరాయిగుంట' కూడ ఎండిపోయిందే! బొడ్డురాయికి నీళ్ళుపోస్తే నిజంగా వర్షం పడుతుందా? పోనీ పడితే ఈ బాధలన్నీ తీరుతాయి కదా? తన ప్రవర్తనవల్ల ఈ అవకాశాన్ని ఎందుకు పోగొట్టుకోవాలి.

కొండడు రచ్చబండ దగ్గర కొచ్చి కూచున్నాడు...


"మీ యిష్టప్రకారం కానీయండి సామీ" అంటూ ఎంకడు తన పెద్దతనాన్ని ముందుకేసు కొచ్చాడు...

పూజారి గారు ముహూర్తం వెంటనే పెట్టేశారు... ఎల్లుండి బుధవారం... దశమి... ఉదయం ఎనిమిది గంటలకు అభిషేకం మొదలవుతుంది... పూజసామగ్రి తదితర వస్తువులకై రంగయ్యశెట్టి చందాలపట్టీ తయారుచేశాడు వెంటనే...

గంగాధరం, కృష్ణమూర్తి వెళ్ళి 'అంటరాని' పల్లె బావిలో నీరు చేది అభిషేకానికి అందచేస్తారని రామానాయుడన్నాడు.

"అదేంటిసామీ! మా బావిలో నీళ్ళు మేం తెచ్చి, పోస్తామేగాని మీ వాళ్ళు ఎలా వస్తారు మా పల్లెలోనికి..." ఊహు! మేం ఒప్పుకోము" మళ్ళీ కొండడు ధ్వజమెత్తాడు...

"మీరు తెచ్చి నీళ్ళుపోస్తే వానదేవుడు మైల పడిపోతాడు! యీ అభిషేకమంతా వ్యర్థమై భ్రష్టు పడుతుంది..." అన్నాడు పూజారి గారు.






## డ్రాఫ్ట్

"ఏమిటయ్యా ఈ డ్రాఫ్ట్ నా మొహంలావుంది" కోపంగా అరిచాడు ఆఫీసర్.

"సారీ సార్. బాలేదని నాక్కూడా అనిపించింది గానీ మరీ మీరన్నంత దరిద్రంగా వుందనుకోలేదు" చెప్పాడు గుమాస్తా.

—జి.శివరామప్రసాద్
(గుంటూరు)



### ఇల్లు

కల్లు దుకాణం మూసేశారు. పీకల దాకా తాగిన యాదయ్య ఆ దుకాణం తలుపులు బాదుతూ—

"ఏమేవ్ తలుపు తియ్యవే. నే వచ్చేశా" అని అరుస్తున్నాడు.

అంతలోనే అటుగా వెళుతున్న మరో తాగుబోతు—

"ఏవయ్యో! తాగావా ఏంటి మా యింటి తలుపులు బాదుతున్నావ్?" అన్నాడు.

—వి. ప్రకాష్ (చిత్తూరు)

"మానీళ్ళు మీరు తెచ్చిపోస్తే పుణ్యమూ, ఫలమ్మూను; మేం తెచ్చిపోస్తే పాపమూ, మైలానా? దేవుడి దృష్టిలో అందరూ ఒక్కటేనని చెప్తూనే వుంటివి... ఇదేం నాటకమయ్యా సామీ!..." అంటూ కొండడు ఎగసెక్కంగా మాట్లాడాడు...

"ఒరే! ఎంకా! మీవాడు ఒకేసారి కాళ్ళకు, తలకు ముడేస్తున్నాడు... ఇక లాభం లేదు... ఏదో అభిషేకం జరిపిస్తే ఏదో యింత వాన చుక్క పడితే అందరూ కలకలలాడుదా మనుకున్నాం కాని ఇన్ని తిరకాసులు పడతాయనుకోలేదు— చూడండి పూజారి గారూ! ఈ అభిషేకాలు వద్దు... అపశోకాలు వద్దు... ఏది ఎలా జరగాలో అలా జరుగుద్ది" అంటూ రామానాయుడు రచ్చబండ పైనుంచి లేచి నిలబడ్డాడు...

"అదేంటండి బాబూ! ఇంతదాకా వచ్చి..." అంటూ పూజారిగారు రామానాయుడు ప్రక్కన చేరాడు...

పూజారిగారు స్వరం తగ్గించి రామానాయుడుతో ఇలా అన్నాడు.

"ఏదానికైనా పట్టువిడుపూ వుండాలి... వాళ్ళనే నీళ్ళు తెచ్చి పోయమనండి... ఆ నీళ్ళను మంత్ర సంప్రోక్షణగావిస్తే నీరు శుద్ధి అవుతుంది.. వాళ్ళ మాట తీసేసినట్లు వుండదు... యీ పుణ్యకార్యం ఇలా జరుగుతుంది...!

ఇంకోమాట అభిషేకం జరిగాక వర్షం పడిందా అది మన పూజాఫలమన్నమాట...! లేదంటారా? "అంటరానిపల్లె" మైలతగిలి వాన దేవుడికి కోపమొచ్చి, వర్షం పడనీయలేదని ఓ చిన్న పుకారు తగిలిస్తే చాలు... అంటరాని వాళ్ళపై కసి ఎలా తీర్చుకోవాలో... ఈ కొండడి పొగరు, గర్వం ఎలా అణిగించాలో మన వూరి వాళ్ళే తేల్చుకుంటారు... ఏమంటారు?"

"ఇక అనేదే ముంది" అంటూ రామానాయుడు గారు అంగీకరించారు... అంతటితో ఆ రోజు రచ్చబండ కొలువు ముగిసింది... గంగాధరం మాత్రం సంతృప్తి పడలేక పోయాడు... అంటరాని జనంపై తన అక్కసు ఎలా తీర్చుకోవాలో? ఏమిటో?? ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాడు...

బుధవారం... ఉదయం ఎనిమిది గంటలు...

ఈ చుట్టు ప్రదేశమంతా శుభ్రంచేసి మామిడి తోరణాలతో 'బొడ్డురాయి' చుట్టూ పందిరి వేశారు... బొడ్డురాయిని పసుపు, కుంకుమలతోను, బంతిపూల మాలలతోను అలంకరించారు... పూజారి గారు విరుగులు పడ్డ మడిపంచెతో, నుదుటన విభూధి రేఖలు దిద్ది మధ్యలో కుంకుమ బొట్టు దిద్దుకుని ఏకాగ్రతతో మంత్రాల్ని జరిపిస్తున్నారు... ఆబాలగోపాలంతో క్రిక్కిరిసి పోయింది ఆ ప్రదేశమంతా!

అంటరాని జనం... స్నానాలు చేసి తమ బావిదగ్గర కెళ్ళి గంగపూజ చేసారు... రామనామ జపంతో బిందెలు బావిలోనికి వదిలి, పైకి చేదుతూంటే, అవి అందుకుని ఎంకడు... వెనగ్గా కొండడు ఆ వెనక పల్లెజనం బయ ల్దేరారు బొడ్డురాయి వైపు... అందర్లో అదో తృప్తి... తమ బావినీళ్ళు భగవంతుడికి అర్పిస్తున్నామని, తమను తప్పక వానదేవుడు కరుణిస్తాడని భగవన్నామ స్మరణ చేస్తున్నారు... అంటరాని జనం బిందెల్తో కదిలివస్తూంటే అదో తిరుణాలలాగే వుంది... ముందు తప్పెట్లు వాయిస్తూ తమ జనాల్లో హుషారు కల్గిస్తున్నారు మరి కొంత మంది... బొడ్డురాయి దగ్గర వాళ్ళకోసం కాచుకున్న పెద్దోళ్ళు యీ సంరంభాన్ని చూసి ఆశ్చర్యపోయారు... అదిరిపోయారు... ఆపై అదోరకమైన ద్వేషం వాళ్ళ గుండెల్లో మొలకెత్తింది.

'అంటరాని' పల్లె బిందెలు వచ్చాయి... బొడ్డురాయికి దూరంగా వుంచి, పూజారిగారు మంత్రాలు జపిస్తూ, వాటిపై పసుపు, కుంకుమలు జల్లి, మామిడాకులతో స్పృశించాడు... నీళ్ళు శుద్ధి కాబడ్డాయి... ఆ బిందెలు తెచ్చి మొదటగా ఎంకడు బొడ్డురాయి మీద గుమ్మరించాడు




ఎంతో భక్తి శద్ధలతో!.... రామానాయుడు గారు మొదటి కొబ్బరికాయను కొట్టాడు... రెండో బిందె కొండడిది... కొబ్బరికాయ రంగయ్యశెట్టి కొట్టారు... కొబ్బరి చిప్పలు సమానంగా, సరిగా పగిలాయి... శుభసూచకమన్నాడు పూజారి గారు— ఆకాశాన... ఉత్తరాన... చిన్నటి మేఘము కదులుతూ వస్తోంది... దాన్ని చూపించాడు సుబ్బడు అందరికీను... బిందె బిందెకు కొబ్బరికాయలు పగులుతున్నాయి... ఖాళీ బిందెలు 'అంటరాని' పల్లెవైపు పరుగులు తీస్తున్నాయి... ఒకొక్క మేఘం కారుమబ్బులతో కదలి వస్తున్నాయి. ఎండ తగ్గి మబ్బు పట్టింది. వాతావరణం చల్లగా అయింది... బొడ్డురాయికి బిందె బిందె పెరుగుతూంటే మేఘాలు క్రమ్ముకుంటు న్నాయి... అందర్లోను ఆశ్చర్యం, ఆనందం ... పూజారి గారు, తనకు యింత మంత్ర శక్తుందా... అని ఆశ్చర్యపోతూ తన పూజవల్లనే యిలా మేఘాలు క్రమ్ముకొని ఓ నిముషంలోనైనా కుంభవృష్టి కురవచ్చని ఆనందిస్తూనే మరింత గట్టిగా, వేగంగా మంత్రాలు చదివేస్తున్నాడు...

రామానాయుడు, తదితరులు యీ వాతావరణ పరిణామాన్ని గమనించి నివ్వెరపోతున్నారు...

బిందెలు కదుల్తున్నాయి... జనాల్లో అదో ఉద్రేకం... ఉద్వేగం. బొడ్డురాయి చుట్టూ నీళ్ళు ఏరులైపారుతూంటే పిల్లలుచేరి నీళ్ళతో ఆడుకూంటూ కేరింతలు కొడ్తున్నారు...

'బొడ్డురాయి'పై పసుపు... కుంకుమలు గుట్టలు గుట్టలుగా పడుతున్నాయి...

పూజారి గారు అప్పుడప్పుడు కర్పూరాన్ని వెలిగిస్తూ జనాల్లో భక్తి తీవ్రతను అంటగడ్తున్నారు... హారతి పళ్ళెంలో పడ్డ నాణాల్ని జాగ్రత్తగా దాచుకుంటున్నాడు.

నల్లటి మేఘాలను చూసి 'అంటరాని' జనం మురిసిపోతూ, 'పండరి భజన' మొదలెట్టారు... కొండడు, ఎంకడు ఆనంద ఉద్వేగాలతో వూగిపోతున్నారు...

అయినా రామానాయుడుకి, గంగాధరునికి చాలా బాధగా వుంది... ఇక యీ 'అంటరాని' వాళ్ళకు పట్టడానికి పగ్గాలుండవని, చెప్పులకింద తొత్తుల్లా వుండరని అనుమానిస్తున్నారు... చల్లగాలి వీస్తోంది... అంటే వాన చినుకులు పడబోతాయనే సూచన... భూమాత కూడ పులకరిస్తోంది...

నూటొక్క బిందె పూర్తయింది. చివరి కొబ్బరికాయ పగిలింది..

అందరూ ఆకాశం వైపు చూశారు... మేఘాలు రయ్యిన దక్షిణం వైపు పరుగులెడ్తున్నాయి... ఒక్కొక్కటే మాయమయిపోయి మళ్ళీ ముందు వాతావరణం



చిత్రం: ఈశ్వర్ (విశాఖపట్నం)



**విరోధి**

"పొద్దున్నే విరోధుల ముఖం చూస్తే అంతా మంచే జరుగుతుంది" చెప్పాడు నర్సింహారావు.

"ఎలా చెప్పగలుగుతున్నావు?" అడిగాడు సదాశివరావు.

"ఈ రోజు నాకు అంతా మంచే జరిగింది. పొద్దున్న లేవగానే మా ఆవిడ మొహం చూశాను" చెప్పాడు నర్సింహారావు.

—జి.శివరామప్రసాద్
(గుంటూరు)

నిలిచింది... ఎంత విపరీతమయింది... అందరి జనాల్లోను నిరాశే!... సంతోషమంతా ఎగిరి పోయింది... జనం అలసిపోయారు— పూజారి పంతులు గారుకొబ్బరి చిప్పల్ని, నైవేద్యంగా పెట్టిన ఫలాల్ని అన్నీతీసి, ఒక సంచిలో గబగబ సర్దేస్తున్నారు...

రామానాయుడు, గంగాధరం... యీ యిద్దరు మాత్రమే సంతోషించారు. కొండడు ఎంకడు మౌనంగా వుండిపోయారు...

"ఇందులో ఏదోతప్పు జరిగుండాలి... లేకపోతే కురిసే వర్షం మాయమవ్వడమేమిటి?" అంటున్నాడు కోపంగా గంగాధరం...

"నే చెప్పలేదటయ్యా! అంటరానోళ్ళు నీళ్ళు పోస్తే వానదేముడికి కోపం వస్తుందని... కురిసే మేఘాల్ని వెనక్కి తిప్పించేసుకున్నాడు చూశారూ!... దీనికంత కారణం యీ కొండిగాడే! ఎంత పొగరు నాకొడుకులకు. పెద్దా చిన్నా లేకుండా మాట్లాడేయడమే... హు! అనుభవించండి..." అంటూ రామానాయుడువడివడిగా వెళ్ళి పోయాడు... వెనగ్గా గంగాధరం నడిచాడు...

కరణంగారు, రంగయ్య శెట్టి అదోలా కొండడి వైపు చూసి తమ దారిన వెళ్ళి పోయారు...

ఊరి జనానికంతా అంటరాని వాళ్ళు శత్రువుల్లా కనిపించారు... సూటిమాటలతో వాళ్ళను కుళ్ళబొడిచారు...

పూజారి గారు మాత్రం బరువుగా వున్న సంచిని అతికష్టంగా భుజాన వేసుకుని అక్కణ్ణించి మెల్లగా తప్పుకున్నాడు...

కొండడు, ఎంకడు, యిక పల్లె జనమంతా తమ పల్లెకు తిరిగొచ్చారు ఎంతో బరువైన హృదయాలతో... బొడ్డురాయి బోసిగానవ్వుకుంది.

* * *

ఆరోజు ఉదయం మాలపల్లెలో తమ బావిలో నీళ్ళు చేదుకోవటానికి వెళ్ళిన రంగి ఒక్కసారి గట్టిగా కేకపెట్టింది బావిలోనికి తొంగిచూస్తూ...

గొంతు తడుపుకోడానికి గుక్కెడు నీళ్ళు కూడా పూరని ఆ బావిలో పూడుమీద గాడిద శవం... *